

# ఆకలి

మంతెన సూర్యనారాయణరాజు

"అమ్మా! ఆకలైతోందే!" అంటూ తల్లి కాళ్లకు చుట్టుకుపోతూ చెప్పింది ఐదేళ్ళరామి. పోశమ్మకి గుండెలో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్లైంది. చంకనున్న తొమ్మిది నెలల పసికందు పాలులేక 'కేర్ కేర్' మంటూ జీవంలేనట్లు ఏడుస్తోంది. ఇద్దరిలో ఎవర్నని సముదాయించగలదు. ఇటు పసికందుకు పాలిద్దామంటే చిక్కిశల్యమైన స్థనాలలో అవిఘనీభవించిపోయాయి. అటు రామికి గంజికాద్దామన్నా నూకలు లేవు. భర్త యాధ్గిరి పట్నం పోయి మూడు దినాలయ్యింది.

అల్లంత దూరంలో సర్కారోళ్లు ఏర్పాటు చేసిన కిరాయిలారీ ఢిల్లీనుంచి మంత్రిగారొస్తున్నారని మందిని పోగేస్తున్నాడు దళారీ. క్రిందటి రోజే పోశమ్మ లాంటి పూటకు ఠికాణలేని బేకార్ గాల్లనందర్నీతోలుకెళ్లి బువ్వ బెట్టిస్తానని రెండ్రోజుల కూలి పైసలిప్పిస్తానని ఒప్పించిండు. అచ్చుకున్నవాళ్ళంతా ఎక్కుతుండగా పోశమ్మ ఆశతో అటుగా రెండంగలేసింది. పోశమ్మదగ్గరలారీ ఆగింది ముందకొచ్చి. "ఎక్కుజల్దీ! నకరాల్ జెయ్యకు మల్ల' అంటూ తొందర జేసిండు దళారీ. పిల్లల్ని ఎవరికో అందించి లారీ ఎక్కుతూండగా "గదేంది. నీతోగాపోరడు, పోరి ఎందుకు తిండి దండుగ" అంటూ కోపంగా గుడ్లురిమిండు. హీన స్వరంతో పోశమ్మ "అల్లకోసమే నేను అక్కడికొచ్చేడ్తి. పొద్దుగాలనుంచి అల్లు నేను ఏంతినలేదు". అంది. వాడు బీడీ వెలిగించిగట్టిగా పొగవదులుతూ "నీయవ్వ. ముగ్గురూ వచ్చేసిగాడనేను తాపిస్తే, తినిపిస్తే పైసల్ గిడతయ్యనినీ ఆలోసన. నువ్వు గొప్ప ఖతర్‌నాక్‌ఉన్నవ్! ఎక్కుమల్ల" అన్నాడు.

ఎక్కిన వాళ్లని కాదనకుండా లారీ పురాగానింపేశాడు దళారీ. కంకరతోలే లారీ ఏమో ఎక్కిన వాళ్ళకు అది గతుకుల్లో పడ్డప్పుడు దుమ్ము రేగి అభిషేకం జేస్తోంది. జారబడ్డ వాళ్ళందరి బట్టలూ ఎర్రటి గంగ సింధూరం రంగు పులుముకున్నాయి పోశమ్మకు ఆకలి దహించివేస్తోంది. క్రితం రాత్రి తిన్న గంజి మెతుకులెప్పుడో అరాయించుకుపోయాయి. రామిమాత్రం ఆశాపూరిత నయనాలతో తల్లిపొట్ట చూపిస్తూ "బువ్వ" అంది. తన అసహాయతను కప్పెట్టుకోవడానికి పోశమ్మ "లొల్లి బెట్టకు, బడేసాబ్ పట్నంలో బువ్వ బెట్టిస్తడు గంతవరకు సప్పుడు సేయక ఊకోమల్లా!" అంటూ గుడ్లురిమింది. రామితల్లి ఏమన్నా చేస్తుందేమోనని భయపడి ఊరుకుంది.

అందర్నీ ఒక చోట దింపి అన్నం పొట్లాలు పంచుతున్నాడు దళారీ, క్లీనరు, డ్రైవర్లు. పోశమ్మకు రెండే ఇచ్చాడు. ఇంకోటివ్వమని చంకలో పోరడ్ని చూపిస్తూ చెయ్యి చాపింది. "హాతేరీ! లమ్డీ! నీకు రెండోదే దండుగ. హేడ్! జరుగు" అంటు చెయ్యి ప్రక్కకు గెంటి మరీ వెళ్ళిపోయాడు దళారీ. అంతా వాళ్ళిచ్చిన భోజనం పొట్లాలతో అర్థాకలినే అణుచుకున్నారు. కడుపునిండా బువ్వ పెట్టిస్తానని చెప్పి దళారోడు దగా సేసిండు. గాసారంతక్కువైగనీకూడ వచ్చినం అంటూ చెవులుకొరుకున్నారు. పోశమ్మతానో పొట్లంతిని రెండో పొట్లంలో రామికింతపెట్టి నీళ్లతాపి, చంకనున్న పోరనికి కూడా గోరుముద్దలు చేసి తినిపించింది. ఎక్కిళ్ళొస్తే పోరనికి నల్లుదగ్గరనీళ్ళు తాగించింది. తాను మిగిలిన ఆకలి అణుచుకోవడానికి నీళ్ళు తాగబట్టింది. వచ్చినట్టే వచ్చి అనల్లా సడన్‌గా బంద్ అయిపోయింది.

> పోశమ్మ తానో పొట్లం తిని రెండో పొట్లంలో రామికింత పెట్టి నీళ్ళు తాపి, చంకనున్న పోరనికి కూడా గోరు ముద్దలు చేసి తినిపించింది. ఎక్కిళ్ళొస్తే పోరనికి నల్లు దగ్గర నీళ్ళు తాగించింది. తాను మిగిలిన ఆకలి అణుచుకోవడానికి నీళ్ళు తాగబట్టింది. వచ్చినట్టే వచ్చి ఆ నల్లు సడన్‌గా బంద్ అయిపోయింది.

మంత్రిగారు విమానం దిగి అక్కణ్నుంచి కేంట్‌సాకారులో సభాస్థలానికి జిల్లా యంత్రాంగం, పోలీస్ ఎస్కార్ట్‌తో వచ్చేటప్పటికి రెండుగంటలుకొట్టింది. ఎండవేడిమికి అందరి నెత్తి మాడిపోతూంది. మంత్రిగారు టోపీ పెట్టుకున్నారు. తనకోసం ఏర్పాటు చేసిన స్టేజ్‌మీద టెంట్‌వేసారు ఎండతగులకుండా. ప్రజలు చెమటలు కక్కేస్తున్నారు. వచ్చినదే తడవుగా మైక్‌ముందుకు అతగాడిని పిలవగానే అలుపూ సొలుపూలేకుండా అరగంట ఉపన్యాసం దంచాడు. ఆయన అలా డయాస్ దిగ్గానే అధికారయంత్రాంగం, అనధికార యంత్రాంగం కదిలింది.

దళారీ లారీ తీసుకొచ్చి "జల్దీ ఎక్కన్రి" అంటూ కేకలేసాడు. అంతా కూడబలుకున్నట్లు "పైసల్‌తేమల్లా!" అన్నారు. కొంతమంది తెలివిగలవాళ్ళు ఈనితో పంచాయితీ పెట్టుకుంటే ఇక్కడే యిడ్చిపెట్టి పోతడని ఎక్కడం మొదలెట్టారు. "ఇంటికెల్లినంక పైసల్ ఫికర్ లేకుండ ఇస్త," అని అందరు ఎక్కగానే డ్రైవర్‌ని పోనిమ్మన్నాడు. దార్లో చాయితాపిచ్చిండు. ఊరులోలారి ఆగింది. దిగేటప్పుడు మాత్రం ఒక్కొక్కళ్ళ ముఖం చూసి దళారీ పదిహేనొకళ్ళకి, పదొకళ్ళకి, ఐదు ఒకళ్ళకి రకరకాలుగా ఇచ్చుకుంటు వస్తున్నాడు. ఎవరెంత అరిచిగీపెట్టినా వినకుండా దళారీ అనుకున్నట్లు రెండ్రోజులది కాకుండా ఒక్క రోజుకేలెక్కకట్టి తగ్గించి ఇస్తున్నాడు. కడుపుమండ సాగింది అందరికీ, ఎప్పుడు విరుచుకుపడదామా అన్న ఆలోచనలో ఉన్నట్టుగా ఉన్నారు.

అందరిలాగే పోశమ్మ బిడ్డలతో బాటు దిగింది. చెయ్యిచూపింది. పన్నెండు రూపాయలిస్తూ 'నీకు రెండు పొకెట్లిచ్చిన" అంటూ చెయ్యిప్రక్కకు గెంటేసాడు. పోశమ్మ "నీ కాల్మొక్కుతా అన్నా! ఇంకో మూడియ్యి' అంటూ ఆర్ద్రంగా అడిగింది. "నీ వెన్ని ఉల్టపల్ట లెక్కలు జెప్పినా గింతే ఇస్తను. తీస్కుంటే తీస్కొలేకుంటే పో!" అంటూలారీ ముందుకు పోనిమ్మని సైగచేశాడు. కడుపు మండిన ఒక వ్యక్తి దగ్గరున్న ఇంట్లోంచి పదునైన గొడ్డలిదెచ్చి ముందుటైర్ మీద రెండుసార్లు నరికాడు అంతే ఆ చక్రంలో గాలి" తుస్...స్...స్...స్..." అంటూ చతికిలబడింది.

మరోకడు గునపంతో డీజిల్ ట్యాంక్ బ్రద్దలు గొట్టాడు. క్రిందగిన్నె పెట్టి ఆ ఆయిల్ బండి మీద పోసి అగ్గిముట్టించాడు. అంతే ఒకటే మంటలు లేచాయి. డ్రైవర్, దళారీ , క్లీనరు పారిపోయారు. అరగంటలో మొత్తం లారీ బుగ్గి బుగ్గి అయ్యింది. అస్తిపంజరంలా ఇనప ఫ్రేముతో మాత్రంమిగిలింది.

★

